సచివాలయం పరిశీలన

విశాలాంధ్ర-తాళ్లూరు : స్థానిక ప్రజా ప్రతినిధులు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసి మారం వెంకటరెడ్డి తదితరులు సచివాలయంలో జరుగుతున్న విధుల నిర్వహణ పనితీరును పరిశీలించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు తాళ్లూరు 1 సచివాలయ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఉద్యోగుల పనితీరు, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వారి స్పందన, రికార్డుల నిర్వహణ, తదితర వాటిని పరిశీలించారు. సచివాలయ సిబ్బందిని ఒక్కొక్కరిగా అడిగి వారు చేసే కార్యక్రమాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఐ వెంకటేశ్వర రెడ్డి, బెల్లంకొండ వారి పాలెం సర్పంచ్ పి సుమలత శ్రీకాంత్ రెడ్డి, వితలాపురం వైసిపి నాయకులు అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

సింగరాయకొండ విద్యార్థినికి జగనన్న ఆణిముత్యాలు..జిల్లా ప్రథమ స్థానం

విశాలాంధ్ర-సింగరాయకొండ : ఏఆర్‌సి అండ్ జివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సింగరాయకొండ నందు 2023లో సీనియర్ ఎంపీసీ పూర్తి చేసుకున్న విద్యార్థిని ఆర్ శివకుమారి 973/1000 జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా నందు ప్రథమ స్థానం పొందినందుకు మున్సిపల్ శాఖామాత్యులు అదిములపు సురేష్, ఒంగోలు శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ చేతుల మీదుగా 50,000 నగదు బహుమతి పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఇనకొల్లు శ్రీనివాసరావు ని మంత్రివర్యులు అభినందించి సన్మానం చేశారు.

ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఎంపీడీఓ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలం నాయుడుపాలెం పంచాయితీలో ఉపాధి హామీ పనులను ఎంపిడివో మరియదాసు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు సకాలంలో పనికి వెళ్లాలని రోజు వారీ కూలి పడేటట్టుగా పని చేయాలన్నారు. పనికి వెళ్లే సమయంలో ప్రతి ఒక్కరు మంచి నీళ్లతో పాటు పని ముట్లు వెంట తెచ్చుకోవాలన్నారు. వేసవి కాలం కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అయన వెంట టీఏ నాగార్జున, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-మద్దిపూడి : అంగన్వాడి కేంద్రాలలో అందించే పౌష్టిక ఆహారాన్ని అర్హులందరూ సద్వినియం చేసుకోవాలని, కొండేపి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ మాధవి లత సూచించారు. కూచిపూడి సెక్టార్‌లోని జువ్విగుంట అంగన్వాడి కేంద్రలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనాభా గిదారి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత ఐటిసి ప్రథమ కోఆర్డినేటర్ ఎస్ వెంకట్రావు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు, శారీరిక, మానసిక, గణితం భాషాభివృద్ధి పెంపొందించడానికి ప్రభుత్వం సరఫరా చేస్తున్న, మెటీరియల్‌తో పిల్లలకు గట్టి పునాది వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ సుచరిత, మహిళా కానిస్టేబుల్ వాణి ప్రసన్న, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర-మద్దిపూడి : మండలంలోని గార్లపేటలో అక్రమంగా మద్య విక్రయిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు, వెంటనే ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 22 మద్య సీసాలను స్వాధీనం చేసుకున్నారు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసు కున్నట్లు ఎస్సై పి.అంకమ్మరావు శనివారం తెలిపారు.

మినీ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- బ్రహ్మం చౌదరి

విశాలాంధ్ర-దర్శి : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు నియోజకవర్గ పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మం చౌదరి మాట్లాడుతూ మహానాడులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో ప్రకటించిన మినీ మేనిఫెస్టోను 150 రోజుల పాటు నియోజకవర్గంలో ప్రజలలోకి తీసుకువెళ్లే కార్యక్రమం, నియోజకవర్గం మండల స్థాయి అనుబంధ కమిటీల నియామకం, ఓటర్ వెరిఫికేషన్ హౌస్ మ్యాపింగ్ తదితర అంశాల గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి పట్టణ పార్టీ అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు, నాగులపాటి శివ కోటేశ్వరరావు, పిడతల నేమిలయ్య, కూరపాటి శ్రీను, బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, యాదగిరి వాసు తదితరులు పాల్గొన్నారు.

యువ ఐఏఎస్ వినూత్నకు అభినందనలు తెలిపిన 'పేస్'

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలుకు చెందిన బొల్లిపల్లి వినూత్న సివిల్స్‌లో ఆలిండియా 462వ ర్యాంకు సాధించినందుకుగా పేస్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపల్ డాక్టర్ జివికె మూర్తిలు అభి నందించారు. శ్రీధర్ మాట్లాడుతు చిన్న వయసులోనే ఐఎఎస్ సాధించిన వినూత్నను నేటి విద్యార్థులు రోల్‌మోడల్‌గా తీసు కోవాలన్నారు. ప్రిన్సిపల్ జివికె మూర్తి మాట్లాడుతూ వినూత్న మెకానికల్ ఇంజినీరింగ్‌లో పట్టాపుచ్చుకుని ఐఎఎస్ సాధించి నందుకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎట రమణ బాబు, డీన్‌ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ వీరాంజనేయులు, అధ్యాపక బృందం వినూత్నను అభినందించారు.

ప్రభుత్వ విద్యుత్ బిల్లుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్ నారాయణ పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు : విద్యుత్ బిల్లుల పేరుతో సామాన్య ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిర్వహించే పోరాటాలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో సిపిఐ ఒంగోలు నగర సమితి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ సీనియర్ నాయకులు ఎస్ డి సర్దార్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం ఎల్ నారాయణ మాట్లాడుతూ ప్రజలు వాడుకునే విద్యుత్ కన్నా ప్రభుత్వం అత్యధికంగా విద్యుత్ బిల్లులు వేస్తూ ప్రజలను ముక్కు పిండి వసూలు చేస్తుందన్నారు. ఫిక్స్ చార్జీలు, కస్టమర్ ఛార్జీలు, విద్యుత్ డ్యూటీ, ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు పేరుతో ప్రభుత్వం ప్రజల జేబులకు చిల్లు పెడుతుంది అన్నారు. ఈ అదనపు చార్జీలు కేవలం ఒక వెనక మాత్రమే పరిమితం కాదని భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని ప్రభుత్వం చెప్పటం దుర్మార్గమన్నారు. ఎప్పుడో వాడిన సరుకు ఖర్చులు పెరిగాయి అనే పేరుతో ఇప్పుడు చార్జీలు వసూలు చేసే విధానం ఏ సరుకు లేదన్నారు. విద్యుత్తుకు మాత్రం ఎలా వర్తిస్తుందని ప్రశ్నించారు. ప్రైవేట్ విద్యుత్ జనరేషన్ కంపెనీలు బొగ్గు సరఫరా కంపెనీల ధన దాహానికి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను బలి చేస్తుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం పితామహుడు గుజ్జుల ఎల్లమందరెడ్డి శత జయంతి ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కోరారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టిన తర్వాతే ఎన్ని గంటలకు వెళతాం అన్న జగన్ హామీ ఏమైంది అని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకుండా ప్రాజెక్టులు ఎలా పూర్తి చేస్తానన్నారు. వీటికి నిరసనగా సిపి ఆధ్వర్యంలో పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నుండి ఒంగోలు కలెక్టరేట్ వరకు త్వరలో సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించినట్లు పేర్కొన్నారు .సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని ప్రతి శివారు కాలనీకి తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఒంగోలు నగర పరిధిలో పెరిగిన జనాభాకు అనుకూలంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి ఒంగోలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఒంగోలు నగరపాలక సంస్థ ను కోరారు. ఈనెల 27, 28, 29 తేదీలలో గుంటూరు నగరంలో నిర్వహించే ఏఐవైఎఫ్ శిక్షణ తరగతులకు ఒంగోలు నగరం నుండి కార్యకర్తలను పంపాలని తీర్మానించారు. అలాగే ఈనెల 18వ తేదీన ఒంగోలు నగరంలో నిర్వహించే ఏపీ మహిళా సమాఖ్య సమావేశానికి, అలాగే ఏఐటియుసి జిల్లా సమితి సమావేశాలలో పాల్గొనాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాష్ రావు, కొత్తకోట వెంకటేశ్వర్లు కె.అంజయ్య, ఎస్ రవిచంద్ర, పి సిద్దయ్య, కల్లూరి లక్ష్మయ్య, నాగేంద్రబాబు, పోలేరయ్య తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గ నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని 20 వార్డులో మౌలిక వసతులు కల్పన శానిటేషన్ రోడ్ల నిర్మాణం సైట్ లైన్ నిర్మాణం పట్టణంలోని ప్రధాన వీధుల్లో నూతన విద్యుదీకరణ వంటి మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. శనివారం నగర పంచాయతీ పరిధిలోని ఎనిమిదో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజా సంక్షేమ పథకాలను ఏ మేరకు అందుతున్నాయి అని అంటూ ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. అందులో భాగంగా అమ్మఒడి రైతు భరోసా చేయూత ఒంటరి మహిళ వంటి పలు సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దే అని ఆయన అన్నారు. నగర పంచాయతీ పరిధిలో తాగునీటి ఎద్దడి గురించి ప్రజలు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. నెదర్లాండ్ వాటర్ స్కీన్ ప్రారంభమైన అప్పటి వాటర్ లైన్లను ఎప్పటికీ వినియోగిస్తున్నారని అన్ని ప్రాంతాలకు తాగు నీరు అందుబాటులో లేవని త్రాగినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. బ్రదర్ ల్యాండ్ స్కీం ప్రారంభంలో దర్శి జనాభా 15 వేల నుండి 18 వేల వరకు ఉండేదని ప్రస్తుత జనాభా 50 వేలకు చేరడంతో తాగునీరు అందడం లేదని అన్నారు.

అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే

దరిశి శాసనసభ్య డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ శనివారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. శాఖల పనితీరును సమీక్షించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ మోహన్‌రెడ్డి విసిరెడ్డి, వెన్నపూస వెంకటరెడ్డి, గంజి వెంకటేష్‌రెడ్డి వేమిరెడ్డి చెన్నారెడ్డి తిరుపతిరెడ్డి పలువురు ఏసీబీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగి నిర్వాకంపై మండిపడ్డ దారపనేని

విశాలాంధ్ర-పామూరు : అంతా నా ఇష్టం, మేము చెప్పిందే వేదం, మేము చేసిందే చట్టం, నిబంధనలతో మాకు సంబంధం లేదని కనిగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు లోని ఒక ఉద్యోగి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపునేని చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కనిగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలోని ఒక ఉద్యోగి నిర్వాహకంతో నుచ్చుపొద సచివాలయ పరిధిలోని అంగన్వాడీలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. మండలంలో పామూరు, మోపాడు, బొట్లగూడూర్, వగ్గంపల్లి నాలుగు సెక్టార్లుగా ఉండేవని, ఇటీవల మూడు సెక్టార్లుగా కుదించి మోపాడు సెక్టార్‌ను రద్దు చేశారు. మోపాడు సెక్టార్ పరిధిలో ఉన్న నుచ్చుపొద, తిరగలదిన్నె, తూర్పు కోడిగుడ్లపాడు, జంగాలపల్లి, పోతవరం గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాలకు, దగ్గరలో ఉన్న పామూరు సెక్టార్‌లో కలపకుండా, 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న వగ్గంపల్లి సెక్టార్‌లో కలపడం వల్ల అంగనవాడి కేంద్రాల కార్యకర్తలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని దారపనేని తెలిపారు. అంగన్వాడి కార్యకర్తలను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో ఐసిడిఎస్ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా ప్రాజెక్టులోని ఒక ఉద్యోగి ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం పై దారపనేని మండిపడ్డారు. ఈ ఉద్యోగి అంగన్వాడి సూపర్వైజర్లు, కార్యకర్తలు, ఆయాల పై పెత్తనం చలా ఇస్తూ తన మాటే నెగ్గేలా ప్రవర్తించే వాడని ధారపనేని ఆరోపించారు. అంగన్వాడి కార్యకర్తలు ప్రశ్నిస్తే ప్రభు త్వం అంగన్వాడీలకు సరఫరా చేసే పౌష్టికాహారం సైతం కోత విధించి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని దారపనేని ఆరోపించారు. ఆ ఉద్యోగి అనాలోచిత నిర్ణయం తీసుకొని కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసే విధంగా వ్యవహరించడం తగదన్నారు. ఆ ఉద్యోగి తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలను జిల్లా కలెక్టర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ మరియు కనిగిరి సిడిపిఓ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఇప్పటికైనా అధికారులు అంగన్వాడి కార్యకర్తల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని దగ్గరలో ఉన్న పామూరు సెక్టార్ లోకి రద్దయిన మోపాడు సెక్టార్ లోని అంగన్వాడి కేంద్రాలను విలీనం చేసి, ఆ ఉద్యోగి పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని దారపనేని డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్‌కు నిత్యావసర వస్తువుల వితరణ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఒంగోలు గణపతి నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సుధాకర్ ఆటో నడుపుతూ జీవనం పొందుతున్నాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు యాక్సిడెంట్ కారంగా రెండు కాళ్లు తీసివేశారు. గత నాలుగు నెలల నుంచి కుటుంబం జరగక ఆర్థిక ఇబ్బందుల్లో ఇల్లు గడవక అర్థాకలితో జీవిస్తున్నారు. సూర్య శ్రీ ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ బాషాను సంప్రదించగా వారి ఆర్థిక ఇబ్బందులను తెలుసుకొని దాతలు సహకారంతో శనివారం మూడు నెలలకు సరిపోవు బియ్యం బస్తాలు నూనె డబ్బా నిత్యవసర వస్తువులను ట్రస్ట్ గౌరవ సభ్యులు మండవ సుబ్బారావు ద్వారా వారి కుటుంబానికి అందజేయడం అయినది. ఈ సందర్భంగా సూర్య శ్రీ ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ బాషా మాట్లాడుతూ సుధాకర్ కుటుంబానికి ట్రస్ట్ అండగా ఉంటుందని తెలిపారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ సుధాకర్ రెండు కాళ్లు పోయి కుటుంబ పోషణకు వైద్య ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతూ కష్టంగా జీవిస్తున్నారు. ఆయన జీవనోపాధికి ప్రభుత్వం దాతలు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల శ్రీనివాసరావు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ రైతులకు వ్యవసాయ అభివృద్ధి పథకాలపై అవగాహన

విశాలాంధ్ర-తాళ్లూరు : ఎస్సీ ఎస్టీ రైతులకు ప్రభుత్వం అమలు పరుస్తున్న వ్యవసాయ అభివృద్ధి పథకాల ను అవగాహన కలిగించవలసిన బాధ్యత అందరిపై ఉందని మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్‌రావు అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ ,ఎస్టీ రైతులకు వ్యవసాయ అభివృద్ధి పథకాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏవో ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఎస్సీ ఎస్టీ రైతుల వ్యవసాయ అభివృద్ధికి యాంత్రికరణ పథకాలు, భూసార పరీక్షలు నిర్వహించడమే కాక వారికి విత్తనాలు, ఎరువులు, సబ్సిడీపై అందించి ప్రభుత్వం ఆదుకునే చర్యలు చేపట్టిందని తెలిపారు. దీనిలో భాగంగా కౌలు రైతులకు కూడా ప్రభుత్వ పథకాలు వర్తించే విధంగా ప్రోత్సాహాన్ని పొందే విధంగా అన్ని అవకాశాలు కల్పించినట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్సెస్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల ఏరియా కోఆర్డినేటర్ గోపనబోయిన వెంకట్రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

సరైన మందులు తీసుకుంటే టీబీ పూర్తిగా నయం

విశాలాంధ్ర-గిద్దలూరు : ఆరు నెలల పాటు టీబీ మందులు వాడినట్లయితే పూర్తిగా వ్యాధి నుంచి విముక్తి చెందుతారని సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టీబి ముక్త్ పంచాయితీపై గిద్దలూరు ఎంపీపీ కడప లక్ష్మీదేవి అధ్యక్షతన టీబీపై అవగాహన కల్పించారు.

క్షయ వ్యాధి రహిత సమాజం కోసం ఉద్యమించాలి

విశాలాంధ్ర-మార్కాపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో "టిబి ముక్తి పంచాయతీ" అనే కార్యక్రమం పై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఐక్యరాజ్యసమితి 2030 సంవత్సరం నాటికి సాధించాలని నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో క్షయ వ్యాధి నిర్మూలన అతి ముఖ్యమైనదని మార్కాపురం యూనిట్ క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ రాంబాబు అన్నారు. ప్రధానమంత్రి టీవీ ముక్తాభారత్ కార్యక్రమంలో భాగంగా 2025 నాటికి ఇండియాని క్షయ వ్యాధి రహిత దేశంగా చేసే లక్ష్యంతో "టీబీ ముక్త పంచాయితీ" అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మార్కాపురం జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే రాహుల్ తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, స్వయం సహాయక బృందాల, మహిళా ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు, టీచర్లు సామాజిక కార్యకర్తలు తదితరులు సంయుక్తంగా ఆ గ్రామపంచాయతీని క్షయ వ్యాధి రహిత గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో నరసింహులు తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, తీవ్రంగా బరువు తగ్గిపోవడం, కళ్లెలో రక్తం పడటం, పూర్తిగా ఆకలి మందగించడం వంటి అనుమానిత క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే కళ్లె పరీక్ష చేయించుకోవాలని తిప్పాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ కే హిమబిందు తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ పోషణ్ అభియాన్ పథకంలో భాగంగా నెలకు 500 రూపాయల చొప్పున ఆరు నెలల పాటు 3000 రూపాయలు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ద్వారా వ్యాధిగ్రస్తుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తామని మార్కాపురం సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ గోవిందరాజులు తెలిపారు. అర్హులైన టీవీ వ్యాధిగ్రస్తులకు పోషణ కిట్లు అందజేస్తామని టిబి హెల్త్ విజిటర్ లక్ష్మీరెడ్డి తెలిపారు.

ఉచితంగా మట్టి నమూనా పరీక్షలు

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని రైతులందరికీ తెలియజేయడమేమనగా మట్టి నమూనాలు సేకరించి ఉచితంగా మట్టి పరీక్షలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి జి వెంకటస్వామి ఓ ప్రకటనలో తెలియజేశారు. శనివారం మండలంలోని చినవరిమడుగు లక్ష్మక్కపల్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులపొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ఉచితంగా మట్టి పరీక్షలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. రైతు భరోసా కేంద్రాలలో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జి వెంకటస్వామి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు సన్మానం

ఏకలవ్య మోడల్ స్కూల్ కళాశాల ప్రిన్సిపాల్ పొన్నూరి శామ్యూల్ జాబ్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : చదువులో ప్రతిభ చూపిన విద్యార్థినీలకు జగనన్న ఆణిముత్యాలుకు దోర్నాల మండలంలోని తిమ్మాపురం గ్రామంలో గల ఏకలవ్య మోడల్ స్కూల్ కాలేజీ విద్యార్థినీలకు శనివారం ఒంగోల్ పివిఆర్ బాయ్స్ హైస్కూల్ నందు జగనన్న ఆణిముత్యాలు అనే కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మరియు ఒంగోల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాల్స్ లేని శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మరియు కలెక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దోర్నాల ఏకలవ్య మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థునీలకు గిరిజన సంక్షేమ శాఖ విభాగంలో ఎంపికైన విద్యార్థినీలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యలో మంచి మార్కులు సాధించిన, గిరిజన సంక్షేమ విభాగంలో జగనన్న ఆణిముత్యాల అవార్డుకు, దోర్నాల మండలంలోని తిమ్మాపురం గ్రామం గల ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఆ కళాశాల ప్రిన్సిపాల్ పొన్నూరి శామ్యూల్ జాబ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థినిలు ఎన్ అంబికా బాయి, బైపీసీ గ్రూపు నందు, డి కృష్ణ శ్రీ భాయి ఎంపీసీ గ్రూపు నందు, బి శిరీష భాయి సీసీ గ్రూపు నందు, ప్రకాశం జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, వాళ్ళ తల్లిదండ్రులకు, పాఠశాల ప్రిన్సిపాల్ అయిన శామ్యూల్ జాబ్‌కు రాష్ట్రం మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మరియు ఒంగోలు ఎమ్మెల్యే బాలయ్య శ్రీనివాస్‌రెడ్డిలు సన్మానం చేసి, విద్యార్థునీలకు 50 వేల రూపాయల నగదు, బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారని తెలియజేశారు.

దర్శి సర్కిల్ పరిధిలో 438మందిపై కేసు నమోదు

విశాలాంధ్ర-దర్శి : దర్శి సర్కిల్ పరిధిలోని దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు, మండలాల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 60 మందిపై కేసు నమోదు చేశామని, వారిలో ఇద్దరికి జైలు శిక్ష మరియు 20 మందికి సుమారు రూ.40,000 ఫైన్ ను విధించారని దర్శి సిఐజె రామకోటయ్య తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 378 మందిపై కౌన్సిలింగ్ చేసి వారిపై కేసు నమోదు చేశారు. వారిలో 185 మందికి రూ 37,000 జరిమానా విధించారని డ్రంక్ అండ్ డ్రైవ్, మరియు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిరుధాన్యాల సాగు పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-తాళ్లూరు : చిరుధాన్యాల సాగు పెంచడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసి మారం వెంకటరెడ్డి లు అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని రైతు భరోసా కేంద్రం-1 నందు శనివారం ఎస్సీ ఎస్టీ రైతులకు ఉచితంగా కందుల విత్తనాలు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు .మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసి మారం వెంకటరెడ్డి లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 2023 వ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించి నందువల్ల చిరుధాన్యాలు పెంచడమే కాక ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయడంలో సహకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా కొర్ర, ఆంధ్రకొర్ర, కంది, రాగులు, సజ్జలు, ఆరికలు, తదితర చిరు ధాన్యాల పంటలను పండించి ఆరోగ్య కరమైన ఆహారపదార్థాలను ఉత్పత్తి చేయాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ రైతులకు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందించి వారి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తుందని వారు తెలిపారు. కందుల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. మండల ఉపాధ్యక్షులు ఐ వెంకటేశ్వరరెడ్డి, బెల్లంకొండ వారి పాలెం సర్పంచ్ పి సుమలత శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు నాయక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బెస్ట్ ప్రిన్సిపాల్‌గా పురస్కారం అందుకొన్న లిల్లీ ప్రకాశవాని

జగనన్న ఆణిముత్యం బూదాల డెలొరస్

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు, వారి ప్రతిభను ఇంకా మెరుగు పరిచేందుకు రాష్ట్రప్రభుత్వం జగనన్న అనిముత్యాలు పేరుతో ప్రభుత్వం కార్యక్రమం చేపట్టింది. మండలంలో ఇంటర్మీడియేట్‌లో ఎక్కువ మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యానికి ఎంపికైన బూదాల డెలొరస్‌ను అభినందించాల్సిన విషయం. మండల కేంద్రమైన పుల్లలచెరువు కస్తూరిబా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ చదివిన నాయుడుపాలెం గ్రామానికి చెందిన బూదాల డెలొరస్ బైపీసీలో 907 మార్కు లు సాధించి జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించింది. రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి వర్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా 50,000 వేల నగదు, మెమెంటో, ప్రసంసాపత్రం అందుకుంది. కెజిబివి ప్రిన్సిపాల్ లిల్లీ ప్రకాశవాని జిల్లాలో బెస్ట్ ప్రిన్సిపాల్‌గా మంత్రి సురేష్, కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంది. జగనన్న ఆణి ముత్యంకు ఎంపికైన బూదాల.డెలొరస్‌ని కెజిబివి సిబ్బంది,గ్రామస్థులు అభినందించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

బీసీ సంఘం నేత పీఎస్‌పీ డిమాండ్

విశాలాంధ్ర-మార్కాపురం : బాపట్ల జిల్లాలో విద్యార్థి అమర్నాథ్‌ను పెట్రోల్ పోసి సజీవంగా తగల పెట్టి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బిసి సంఘం అధ్వర్యంలో శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సేదూ మాధవన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర బిసి బ్రిలియంట్ కమ్యూనిటీస్ అసోసియేషన్ అధ్యక్షులు పిఎల్‌పి యాదవ్ మాట్లాడుతూ తన సోదరిపై కొందరు దుర్మార్గులు లైంగికంగా వేధిస్తున్న క్రమంలో నిరోధించిన ఆ విద్యార్థిపై పెట్రోల్ పోసి పైశాచికంగా తగలబెట్టారన్నారు.

ముసలయ్యను పరామర్శించిన ప్రజా సంఘాలు

విశాలాంధ్ర-పామూరు : గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స అనంతరం సొంత గ్రామం మోటరులపాడులో విశ్రాంతి తీసుకుంటున్న బిటిఏ నాయకులు ఉపాధ్యాయులు ముసలయ్యను ప్రజా సంఘాల నాయకులు వైఎస్ఆర్సిపి నాయకులు కటికల వెంకటరత్నం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోచిపాతల రవికుమార్ మాదిగ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, ప్రధానోపాధ్యాయులు కుడారి రామ్మోహనరావు, దళిత హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గోన దానయ్య, పాపబత్తిని ఏడుకొండలు, కటికల అగస్టీన్ తదితరులు పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.

ఆధునిక సాంకేతిక టెక్నాలజీపైనా అవగాహన పెంచుకోవాలి

జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఉన్నత స్థానానికి చేరుకోవడానికి విద్యతోపాటు సమకాలీన అంశాలపైనా, ఆధునిక సాంకేతిక టెక్నాలజీపైనా అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం గుంటూరు రోడ్డులోని ఏ-1 కన్వెన్షన్ హాలులో నిర్వహించిన బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ - 2023 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పూర్తయిన తరువాత ఇంజినీరింగ్ విభాగంలో ఏ కోర్సు, ఏ యూనివర్సిటీ, ఏ కాలేజీని ఎంపిక చేసుకోవాలి అనే అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన బ్రిలియంట్ ఎడ్యుకేషనల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చదువుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయం బ్యాంకుల నుంచి ఏ విధంగా పొందాలి అని తెలిపేలా స్టాల్సు ఏర్పాటు చేశారన్నారు. గత 20 సంతవ్సరాల నుంచి ఈ విద్యా సంస్థ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఇంజనీరింగ్ విభాగంలోనే కాకుండా విద్యార్థులకు అవసరమైన అన్ని విభాగాలలో ఇలాంటి కార్యక్రమాలు జిల్లా మొత్తం చేపట్టాలని కలెక్టర్ వారికి సూచించారు. విద్యతోపాటు కమ్యునికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుత మున్న టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని ఆ వైపు పట్టు సాధించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల అనేక విషయాలు విద్యార్థులు తెలుసుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.కె. న్యాసత్, డాక్టర్ ఎస్.కె. తహూర, సివిల్స్ ర్యాంక్ సాధించిన ఒంగోలు యువతి బి. వినూత్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిని సన్మానించిన మంత్రి, కలెక్టర్

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఒంగోలులో పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు వెలిగండ్ల మండలం మొగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి హరికృష్ణ, ప్రహల్లాద రెడ్డి పదో తరగతి పరీక్షలలో 586 మార్కులు సాధించినందుకు గాను పురపాల శాఖ మంత్రి ఆదిమల సురేష్ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా 50వేల రూపాయలు మెమొంటో అందజేశారు. ఈ క్రమంలో రాజాల కొండారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో ప్రతిభను కనబరిచినందుకుగాను ఈ అవార్డు ప్రధాన లభించిందని ఇది విద్యార్థులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ప్రతిఫలం అని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బాల్నేని శ్రీనివాస్ రెడ్డి, డీఈవో తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా 2.5 లక్షలు అందజేత

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామంలో శనివారం మన గ్రోమోర్ ఆధ్వర్యంలో వ్యవసాయంలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహనా కార్యక్రమం శనివారం నిర్వహించారు. నల్లగుంట్ల గ్రామానికి చెందిన వ్యవసాయ రైతు నల్లగుంట్ల వెంకట రమణ ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందాడు. అయితే రమణ మన గ్రామోర్లో 59 రూపాయల ప్రీమియం చెల్లించి ప్రమాద భీమాలో సభ్యుడై ఉన్నందున ప్రమాద భీమా క్రింద రమణ భార్య లక్ష్మీ పొలమ్మకు గ్రోమోర్ జోనల్ మేనేజర్ డాక్టర్ చక్రధర్ 2.5 లక్షల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన గ్రోమోర్ సంస్థ వ్యవసాయ సేవలతో పాటు ప్రమాద భీమా పథకాలు వ్యవసాయ రైతుల కోసం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు.కార్యక్రమంలో చక్రధర్‌తో పాటు మన గ్రోమోర్ భీమా పథకం మేనేజర్ రవి, మార్కాపురం మేనేజర్ అనిల్, కొమరోలు మేనేజర్ నాగ శంకర్‌రెడ్డి, నల్లగుంట్ల సర్పంచ్ గుడిపాటి ప్రదీప్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు సూరా పాపిరెడ్డి నగర్‌లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. శనివారం సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా సూరా పాపిరెడ్డి నగర్‌లో మున్సిపల్ చైర్మన్ పర్యటించారు. స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. సూరా పాపిరెడ్డి నగర్‌లో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు మున్సిపల్ చైర్మన్‌ను కోరారు. సమస్యపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, సూరా పాపిరెడ్డి నగర్‌లో ఉన్న డీప్ బోరు నుండి ప్రత్యేకంగా పైప్ లైన్ ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి మీరు అందించేందుకు చర్యలు తీసు కుంటున్నట్లు స్థానికులకు తెలిపారు. ఇంజనీరింగ్ అధి కారులను పిలిచి పైప్ లైన్ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వీలైనంత త్వరలో పైప్ లైన్ పనులను పూర్తి చేసి సూరా పాపిరెడ్డి నగర్ కు శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఎమినిటీ కార్యదర్శి షంషీర్, వర్క్ ఇన్స్పెక్టర్ షరీఫుదీన్, వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి, బ్రంహయ్య తది తరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన సీఎం జగన్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కొనియాడారు. శనివారం "జగనన్న ఆణిముత్యాలు" జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం విద్యా శాఖ అధ్వర్యంలో ఒంగోలులోని పి.వి.ఆర్. బాలుర హైస్కూల్లో ఘనంగా నిర్వహిం చారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదివి ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇలాంటి పురస్కారాలు మరింత ఉత్సాహం ఇస్తాయని అన్నారు. పేద విద్యార్థులకు ఈ కార్యక్రమం వల్ల ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఆణిముత్యాల్లాంటి విద్యార్థులను వెలికితీయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను ముఖ్యమంత్రి పూర్తిగా మార్చివేశారని ఆయన చెప్పారు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న విద్యాకానుక, వసతి దీవెన వంటి ఎన్నో మంచి కార్యక్రమాలను ఏర్పాటు చేసి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఆయన కొనియాడారు. ఈ పోటీ ప్రపంచంలో నిలబడాలంటే ఇంగ్లీష్ విద్య అవసరాన్ని గుర్తించి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టినట్లు ఆయన వివరించారు. ఎన్నడూ లేని విధంగా మూడవ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్ విధానాన్ని ప్రవేశ పెట్టారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు కూడా బాగా చదువుకొని ఉన్నత స్థితిలో ఉండే విధంగా విద్యకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ నాలుగేళ్లలోనే కేవలం విద్య కోసం సుమారు రూ.50 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించిందన్నారు. ఇంత పెద్ద మొత్తంలో విద్య కోసం ఖర్చు చేయడం శుభపరిణామమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి అవసరమైన అన్ని సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఇలాంటి ఉన్నతమైన. కార్య క్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థు లకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని ముఖ్యమంత్రి ఒక మేనమామగా బాధ్యత తీసుకున్నారని ఆమె అన్నారు. గతంలో సగం విద్యా సంవత్సరం పూర్తి అయినా కూడా పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందేవి కావన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత పాఠశాలలను ప్రారంభించిన మొదటి రోజే. జగనన్న విద్యా కానుక కిట్‌ను విద్యార్థులకు ఇచ్చారన్నారు. ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల, నియోజకవర్గ, జిల్లా, స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు నగదు ప్రోత్సాహకాలను అందించడం, విద్యార్థుల తల్లి దండ్రులు, గురువులను సన్మానించడం గొప్ప కార్యక్రమంగా విలుస్తుందని ఆయన అన్నారు. సహాయం కోసం తన దగ్గరకు వస్తే కచ్చితంగా తనవంతు సాయం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, టైలర్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ సుభాబీ, ఒంగోలు నగర మేయర్ గంగార సుజాత పాల్గొన్నారు.

పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న 'నవరత్నాలు'

మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

విశాలాంధ్ర-పెద్దారవీడు : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల కుటుంబాలలో వెలుగు నింపుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పెద్దారవీడు మండలం తంగిరాలపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వం పరంగా ఏం వరకు లబ్ధి చేయకున్న విషయాన్ని లబ్ధిదారులకు వివరించారు. 25 లక్షల రూపా యలతో నిర్మించిన నూతన సిమెంట్‌రోడ్డుని ప్రారంభించారు. వైఎస్ఆర్ యంత్ర పరికరాలలో బాగంగా గ్రూప్ సభ్యులకు రాయితీ పై ట్రాక్టర్ పంపిణీ చేశారు. విద్యార్థులకు జగనన్న కిట్లు పంపిణీ చేశారు. ఇటీవల కాలంలో గుండెపోటుతో మరణించిన సచివాలయం కన్వీనర్ పిన్నెబోయన ఈశ్వరయ్య కుటుంబానికి 50 వేల నగదు మంత్రి స్వంత డబ్బులు ఇవ్వడం జరిగింది. మంత్రి సురేష్ మాట్లాడుతూ జగనన్న ఎన్నికల ముందు చేసిన సదురు పాదయాత్రలో పేదలు కష్టాలు తెలుసుకొని చలించిపోయారని ఆ కష్టాలు తీర్చేందుకు ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాన్ని ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు పరుస్తున్నారని అన్నారు. వైసిపి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉడుముల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, జడ్పీటీసి ఏరువా చలమారెడ్డి సర్పంచ్ తోకల నాగమల్లేశ్వరి, ఎంపీటీసీ ఉప్పలపాటి భాగ్యరేఖ, డివిజనల్ అభివృద్ధి అధికారి సాయికుమార్ ఎంపీడీవో నాసర్‌రెడ్డి, తహసిల్దార్ వెంకటకృష్ణారెడ్డి, ఏపీవో సాంబశివయ్య, ఏపిఎం శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శ్రావ్య, విద్యుత్ ఏఈ రమేష్ సర్పంచులు వెన్న శివ కృష్ణారెడ్డి, పాలగిరి రామాంజనేయరెడ్డి, ములా వెంకట రమణారెడ్డి, అంగిరేకుల ఆదినారాయణ యాదవ్, బెజవాడ ఆదం, వైసీపీ నాయకులు చిమట వెంగయ్య, మండల సోషల్ మీడియా కన్వీనర్ శొంఠి నాగార్జునరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తడికమల్ల బాల సుబ్బారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన చింతలచెరువు

విశాలాంధ్ర-కనిగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణండ్డి కనిగిరి మండలం ఏరువారిపల్లి ఎస్సీ కాలనీలో ఇటీవల యాక్సి డెంట్ గురై మంచానికే పరిమిత మైన బల్లి చినబాబు వారి కుమార్తె లను శనివారం పరామర్శించారు. బాధితులకు రూ.20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన వైద్యానికి సంబంధించి ఎలాంటి సహాయం కావాల్సిన తప్పక సహాయం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరువారిపల్లి సర్పంచ్ దమ్ము వెంకటయ్య, వీరం రెడ్డి బ్రహ్మారెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ వీరం రెడ్డి నాగిరెడ్డి, సచివాలయ కన్వీనర్ పగడాల శివ, మైనార్టీ సెల్ నాయకులు షేక్ మస్తాన్ బడే సాహెబ్, వైసీపీ నాయకులు మూలె గోపాల్ రెడ్డి , కొండారెడ్డి ,ప్రసాద్, వాలంటీర్లు ఉస్మాన్, ప్రతాప్, నాయకులు చైతన్య, యేగయ్య తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ జిల్లా టాపర్ ప్రవల్లిక

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : హనుమంతునిపాడు మండల పరిధిలోని దాసరిపల్లి గ్రామ నిరుపేద కుటుంబం అయినా వేశపోగు కాశయ్య కుమార్తె వేశపోగు ప్రవళిక హనుమంతునిపాడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యను అభ్యసించి గత నెల 10వ తరగతి పరీక్షా ఫలితాలలో 600కు గాను 565 మార్కులు సాధించి ప్రకాశం జిల్లా కస్తూర్బా గాంధీ విద్యాలయాల జిల్లా టాపర్‌గా నిల్చింది. "జగనన్న ఆణిముత్యాలు" ప్రతిభా అవార్డులు భాగంగా ఒంగోలులోని స్థానిక పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్,జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, మాజీ మంత్రివర్యులు బాలినేని శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా అందించారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

విశాలాంధ్ర-తర్లుపాడు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు జీవీకే 4 కిట్లను పంపిణీ చేసినందుకు మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు జె వీ కే 4, ఆకారంలో కూర్చొని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు ముత్తోజు సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మో హన్‌రెడ్డి విద్యాశాఖ పై చూపుతున్న ఆసక్తికి అనుగుణంగా ఆయన లక్ష సాధనకు 2023 - 24 సంవత్స రంలోవిద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగినకృషిచేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి

కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్

విశాలాంధ్ర-ఒంగోలు : ఉజ్వల భవిష్యత్ కోసం స్టూడెంట్స్ అవకాశాలు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఏ1 ఫంక్షన్ హాల్లో జరిగిన బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ వారు నిర్వహించచిన బ్రిలియంట్ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్-2023లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం బ్రిలియంట్ సంస్థ వారు ప్రతి సంవత్సరం మెగా సెమినార్ ఏర్పాటు చేసి, విద్యార్థులకు అవసరమైన అంశాలను అందిస్తున్న వారిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఇక ముందు కూడా ఇలాంటి సమాజానికి తోడ్పడే మరిన్ని కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఒంగోలు శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్టూడెంట్స్ వికాసం కోసం బ్రిలియంట్ సంస్థ అధినేతలు డాక్టర్ న్యామత్, డాక్టర్ తౌహేరా దంపతులు ఎప్పుడూ ముందుటారని, అభినందించారు. ఇలాంటి మరెన్నో కార్యక్రమలు చేయాలని, ఆకాంక్షించారు. ఈ విషయం లో తమ సహకారాన్ని ఎల్లవేళలా అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ డి.జి.పి. కె.ఆర్.ఎం.కిషోర్ కుమార్ ఐ.పి.ఎస్. మాట్లాడుతూ స్టూడెంట్స్ మనసు పెట్టి ప్రయత్నిస్తే మీరు కోరుకొన్న జీవితం మీకు లభిస్తుందని అన్నారు. కొందరికి సరైన అవగాహన లేక మంచి అవకాశాలు కోల్పోతుంటారని, ఇలాంటి మెగా ఫెయిర్ లు అలాంటి వారికి దిశానిర్దేశం చేస్తాయని అంటూ బ్రిలియంట్ సంస్థ వారిని అభినందించారు.

ప్రొఫెసర్ హరగోపాల్, సంధ్యలపై కేసును వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : పీడిత ప్రజల నేత, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ కామ్రేడ్ వీ సంధ్యలతో పాటు మరో 150 పై అక్రమంగా పెట్టిన ఉపా కేసుని వెనక్కి తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి పద్మ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నాడు ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీడిత ప్రజల సమస్యల కోసం పోరాడుతూ అణచివేతకు గురవుతున్న మహిళల సాధికారత కోసం, స్త్రీ పురుష సమానత్వం కోసం గత 40 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కామ్రేడ్ సంధ్య పై "ఉపా కేసును "బనాయించడం దుర్మార్గం అన్నారు. మహిళల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న అనేక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టారన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో పెట్టి ఆమోదించాలని అనేక రూపాల్లో పోరాటాలు చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో రాష్ట్ర మొత్తం తిరిగి మహిళలను చైతన్యవంతం చేసిందన్నారు. మేధావిగా ఉంటూ, విద్యారంగా ప్రక్షాళనకై, దేశవ్యాప్తంగా విద్యార్థుల ను చైతన్యవంతం చేస్తున్నటువంటి ప్రొఫెసర్ హర గోపాల్ గారికి మీద 'ఉపా కేసు బనాయించటం చట్ట విరుద్ధం అన్నారు. అంతేకాకుండా ఉపా కేసు పెట్టిన 150 మంది మేధావులు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశారని, ఆ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. ప్రశ్నించే గొంతులను, పేద ప్రజల కోసం పనిచేసే సంఘాలను నిర్మూలించాలనుకోవటం రాష్ట్ర ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనం అన్నారు. కనుక ఈ విషయం మీద కేసీఆర్ కల్పించుకొని మేధావులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ భారతి, వి మంజుల, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ పద్మ, జిల్లా నాయకులు ఎన్ వేణి రవీంద్ర, ఎల్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి జలగలు

- సమస్య విన్నవించుకోవడానికి వెళ్లిన రైతులపై తహసీల్దార్ చిందులు
- ప్రతి పనికి ఓ రేటు
- అటెండర్ స్థాయి నుండి పైస్థాయి వరకు అధికారులందరిదీ ఇదే తీరు
- తహసీల్దార్ కార్యాలయంలో ప్రవేటి వ్యక్తుల విధులు?
- తండ్రి స్థానంలో వీఆర్ఓగా కొడుకు
- చోద్యం చూస్తున్న జిల్లా అధికారులు

విశాలాంధ్ర-పీసీపల్లి : పురుడు పోస్తే లంచం.. బొడ్డు కోస్తే లంచం.. ఎదగడానికి లంచం.. బ్రతకటానికి లంచం. లంచాలు లేనట్టి మంచి సమాజం కావాలన్నా ఇవ్వాలి లంచం.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న లంచాల జలగలపై ఓ సినీ కవి ఆగ్రహం ఇది. మండలంలోని పలు ప్రభుత్వ శాఖలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయాయి. ఏసీబీ దాడులలో అధికారులు పట్టుబడుతున్నా మిగిలిన వారిలో మాత్రం చలనం కలగడం లేదు. ప్రతి పనికి ఒక రేటు అని నిర్ణయించి మరీ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఏసీబీ దాడులలో కొంతమంది అవినీతి అధికారులు పట్టుబడుతున్నా కొన్ని రోజులు నెమ్మదించి తర్వాత మరలా తమ చేతివాటం చూపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జలగలు అమాంతం పెరిగిపోతున్నాయి. రైతుల వద్ద నుండి వేలల్లో, లక్షల్లో డబ్బులు వసూలు చేస్తూ పనులు చేయకుండా అందినకాడికి రైతుల వద్ద నుంచి దోచుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. శనివారం తమ సమస్యలను తహసిల్దార్‌కు వివరించుకోవడానికి వెళ్లిన రైతులపై తాసిల్దార్ చిందులు తొక్కారు. మీ ఇష్టం వచ్చిన చోట కంప్లైంట్ చేసుకోండి అంటూ ఒకింత ఆగ్రహానికి గురయ్యారు. దీంతో రైతులు తహసిల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిని బట్టబయలు చేయడంతో తహసిల్దార్ నెమ్మదించారు. వివరాల్లోకి వెళితే మండలంలోని పెద అలవలపాడు గ్రామానికి చెందిన ఓ రైతు ఐదు రోజుల క్రితం అగ్రికల్చర్ ఇన్కమ్ ధ్రువీకరణ పత్రం కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఫైలు విఆర్ఓ ద్వారా ఆర్ఐ డిటి వెరిఫికేషన్ అనంతరం తహసిల్దార్ వద్దకు వెళ్ళింది. సదరు తహసిల్దార్ ఆ గ్రామ వీఆర్వో అని పిలిపించి డబ్బులు డిమాండ్ చేయమని ఆదేశించారు. బాధితులు డబ్బులు ఇవ్వకపోవడంతో వెంటనే తక్షణం ఆలోచించ కుండా తహసిల్దార్ ఫైలును రిజెక్ట్ చేశారు. ధ్రువీకరణ పత్రం రిజెక్ట్ అయినట్టు బాధితుడు చరవాణి కి మెసేజ్ రావడంతో ఒకింత ఆశ్చర్యానికి గుర య్యాడు. పెద అలవలపాడు గ్రామానికి చెందిన మరొక రైతు మిట్టమీద పల్లి గ్రామ పరిధిలోని పొలాన్ని ఆన్లైన్ చేసేందుకు రూ 20000 డబ్బులు తీసుకుని అనంతరం ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తటం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. గుదేవారిపాలెం గ్రామానికి చెందిన మరో రైతు వద్ద పట్టాదారు పాస్ బుక్ కోసం రూ.20000 డబ్బులు డిమాండ్ చేసి తీసుకున్నా నంతరం ఎన్నిసార్లు విఆర్ఓని అడిగిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తండ్రి స్థానంలో కొడుకు వీఆర్ఓగా విధులు నిర్వహిస్తూ దందాకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు

మండలంలోని పెదఇర్ల పాడు ముద్దపాడు గుదేవారిపాలెం పంచాయతీ విఆర్ఓగా పనిచేస్తున్న సుబ్బారావు స్థానంలో సుబ్బారావు కొడుకు విఆర్ఓగా తండ్రి స్థానంలో విధులు నిర్వర్తిస్తున్నా ఎవరు ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవడం గమనార్హం. అయితే శనివారం తహసిల్దార్ కార్యాలయంలోకి బాధిత రైతులు వచ్చి తండ్రి స్థానంలో కొడుకు ఎలా విధులు నిర్వహిస్తున్నారు అతని ఎలా మీరు తహసిల్దార్ కార్యాలయంలోనికి వీఆర్వోగా విధులు నిర్వహించేందుకు ఎందుకు అనుమతిస్తున్నారు అతన్ని విఆర్ఓ గా కొనసాగించడానికి పై అధికారుల నుండి అనుమతులు ఏమన్నా వచ్చాయా అంటూ తాసిల్దారును రైతులు నిలదీశారు. దీంతో తహసిల్దార్ దగ్గర రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానమే లేకపోయింది.గతంలో కనిగిరిలో రైతుల వద్ద నుండి డబ్బులు వసూలుచేసి అనేక దందాలకు పాల్పడ్డారు. ఇది గమనించిన కనిగిరి మండలం రైతులు అతన్ని పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్ లో అప్పజెప్పడం కూడా జరిగింది. ఈ విధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తుల హవా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. వేలకు వేలు డబ్బులు వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నా అధికారులు అతన్ని పట్టించుకున్న పాపాన పోవడం లేదు. వీళ్లే కాకుండా మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో విఆర్ఓలుగా విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఒక్కరూ రైతుల వద్ద నుండి అధిక సంఖ్యలో డబ్బులు వసూలు చేస్తూ అధిక సంఖ్యలో అవినీతికి పాల్పడుతున్నారు. ఈ విషయమై విఆర్వో లను రైతులు ప్రశ్నిస్తే మేము తీసుకున్న మొత్తంలో సగం ఆర్డిఓకు డిటి తహసిల్దార్ కు మేము కొంత మొత్తంలో అప్పచెప్పాల్సిందే అంటూ బహిరంగంగా రైతుల వద్ద అధిక మొత్తంలో డబ్బులు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఆర్డీవో సంబంధిత అవినీతి అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఇదే విధంగా ఉంటే ఏసీబీకి మరో అవినీతి చేప పట్టుబడటం ఖాయం

గతంలో పిసిపల్లి మండలంలో పనిచేసిన అధికారులు అందరూ అవినీతికి అధికంగా పాల్పడుతుండటంతో అనేకమంది ఏసీబీ దాడులు దొరికిపోవడం చూస్తుంటే రాబోయే కాలంలో మరొక అవినీతి చేప ఏసీబీ దాడుల్లో దొరకడం ఖాయం అనిపిస్తుంది. ప్రభుత్వ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతుండటంతో ఈ పరిస్థితులు రావడం ఖాయం అనిపిస్తుంది. చేసే పని తక్కువ రైతుల వద్ద నుండి డబ్బులు మాత్రం అధిక సంఖ్యలో ముక్కుపిండి వసూలు చేయడం ఎక్కువ అనే నినాదంతో పీసీ పల్లి మండల అధికారులు విధులు నిర్వహిస్తుండటం సిగ్గుచేటుగా భావించాలి.